పెండింగ్ పనులు ప్రారంభించాలి


పద్మారావుగౌడ్‌ను కలిసిన వివిధ శాఖల అధికారులు

సికింద్రాబాద్: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కోరారు. మంగళవారం పద్మారావుగౌడ్‌ను కలిసిన టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్, ఇతర సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని రోజుల్లో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏసీపీ రజిత, ఇంజినీర్లు సరిత, ప్రకాశ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కేఈఐ పాత్ర మరువలేనిది


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎలక్ట్రిషియన్లు

రాంగోపాల్‌పేట్: వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవలోనూ కేఈఐ వైర్స్ అండ్ కేబుల్స్ సంస్థ ముందుందని ఇంటర్నేషనల్ కాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని మెట్రోపాలిస్ హోటల్‌లో మంగళవారం కేఈఐ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషియన్లకు సీఎస్ఆర్ కింద స్వాస్థ్య ఉత్సవ్ పేరుతో జనరల్ హెల్త్ చెకప్, ఐ చెకప్‌తో పాటు హెల్త్ కార్డులను అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రిషియన్లు పని ఒత్తిడితో ఆరోగ్యంపై శ్రద్ధ చూపించరని వారి, వారి కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేఈఐ బ్రాంచ్ హెడ్ వాసుదేవ రావు, సీనియర్ మేనేజర్ సుమిత్ శ్రీవాత్సవ్, మేనేజర్ భార్గవ్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కిందిబస్తీలో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రహదారుల నిర్మాణం, పలు అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని అన్నారు. కార్పొరేటర్ వెంట బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు మస్తాన్, గౌస్, బస్తీ ప్రజలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సీవరేజ్ పైపులైన్ పనులను ప్రారంభించిన హేమలత

పద్మారావునగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి..డివిజన్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. డివిజన్‌లోని భోలక్‌పూర్‌లో రూ.7 లక్షల వ్యయంతో చేపడుతున్న సీవరేజీ పైపులైన్ పనులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ ప్రజలు తాము సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, విజయలక్ష్మీ, నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి

లిబర్టీ: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్ధానాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జన సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆరు గ్యారంటీలను అమలుచేసి ప్రజల ఆదరణ పొందాలని సూచించారు. మంగళవారం లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్ధానాలు హామీలు అమలు చేస్తూనే ప్రజలు విశ్వసిస్తారన్నారు. కొత్త పథకాలు అమలు కోసం ఆర్థిక వనరులు సమీకరించుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంటుందన్నారు. పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు వేగంగా అమలు చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. విద్య, వైద్యం రోడ్లు తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన ఇన్‌సైడర్ ఎక్స్ ప్రదర్శన

బంజారాహిల్స్: విద్యార్థులు, ప్రస్తుత డిజైనర్లకు తాము నిర్వహించే ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్–2024 వారి ఉన్నతికి దోహదం చేస్తుందని హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ పల్లవి అంచూరి అన్నారు. మంగళవారం 5వ ఎడిషన్‌ను జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో ఆవిష్కరించారు. వచ్చే ఏడాది జూన్ 28 నుంచి 30 వరకు ఈ ఈవెంట్ జరుగుతుందన్నారు. థీమ్ డిజైన్ స్ట్రీట్ డిజైనర్లు, విద్యార్థులు, ఆర్కిటెక్ట్‌ల కోసం కళలు, చేతి పనులు, విద్యావర్క్‌షాప్‌ల ప్రత్యేకమైన సమ్మేళనంగా ఉంటుందన్నారు. వృత్తి టార్చ్ బేరర్లు సెట్‌చేసిన సృజనాత్మక ఉదాహరణలను ముందుకు తీసుకెళ్లడానికి వారిని ప్రోత్సహించేందుకు ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. దీనికి పాండ్యా నుంచి 3 వేలమంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డిజైన్ సంబంధిత వాణిజ్య నిపుణులు, బిల్డర్లు ఉంటారన్నారు. ఇది వాణిజ్య ప్రదర్శన దేశ వ్యాప్తంగా ఉన్న హోమ్ చాప్టర్లలో ప్రముఖమైందన్నారు. 150 మంది ఎగ్జిబిటర్లు, 300లకు పైగా బ్రాండ్ల భాగస్వామ్యంతో డిజైన్‌పరిశ్రమలో సరికొత్త ట్రెండ్లను ప్రదర్శిస్తుందన్నారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ నిరూప్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ రాకేష్‌వాసు, కో–కన్వీనర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను నవీకరణకు శ్రీకారం


- భవనాలకు పన్ను మదింపు
- ప్రారంభమైన సర్వేలు
- ఆదాయం పెంచే దిశగా లష్కర్ జీహెచ్‌ఎంసీ కసరత్తు


సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

లష్కర్‌లో భవనాల తీరు

మొత్తం భవనాలు: 53537
నివాస భవనాలు: 47345
వాణిజ్య భవనాలు: 3889
నివాస+వాణిజ్య భవనాలు: 2309

సికింద్రాబాద్: ఆస్తి పన్ను ప్రక్రియను నవీకరించే ప్రక్రియకు సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇక్కడ కొత్తగా నిర్మాణం పూర్తయిన రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలను గుర్తించి పన్ను మదింపు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. భవనాల స్థితి ఎత్తు, వైశాల్యం తదితర వివరాల ఆధారంగా కొత్త పన్ను విధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.
ఇప్పటికే ప్రధాన రహదారుల్లోని భవనాల సర్వే పూర్తి చేసిన అధికారులు, త్వరలో అంతర్గత రహదారులను సర్వే చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఎన్నికల విధులు ముగిసిన నేపథ్యంలో 2013–14 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను రాబట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం ఈనెల చివరి వారం నుంచి ఆస్తిపన్ను మదింపు, వసూలు కోసం సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఐదు డివిజన్ల పరిధిలోని అన్ని గృహాల సర్వే త్వరితగతిన పూర్తి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పోర్టల్‌లో ఇంటి నెంబర్ నమోదు చేస్తే చాలు సదరు భవనం నిర్మాణం తీరు, ఆస్తిపన్ను వివరాలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు కంప్యూటరీకరిస్తున్నారు. భవన నిర్మాణదారులు కూడా స్వయంగా ఇంటి నిర్మాణం తీరుతెన్నులను జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సొంతంగానే అసెస్‌మెంట్ చేసుకుని చెల్లింపులు చేసుకునే అవకాశం పట్ల నిర్మాణదారులకు అవగాహన కల్పిస్తున్నారు.



జియోగ్రాఫికల్ సర్వేతో..

జియోగ్రాఫికల్ సర్వే ప్రాతిపదికన సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని భవనాలన్నింటిని రెండేళ్ల క్రితమే జీహెచ్‌ఎంసీ అధికారులు ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు. తాజా సర్వే ద్వారా కొత్తగా వెలిసిన భవనాల వివరాలు, పాత భవనాలపై కొత్తగా వేసిన అంతస్తులు తదితర ఫొటోల సేకరణ వంటి వివరాలు సేకరిస్తున్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఇంటి నెంబర్ల ఆధారంగా అంతస్తులు, వైశాల్యం వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ట్యాక్స్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రయోగాత్మకంగా ఇప్పటికి ప్రధాన రహదారుల్లోని భవనాల వివరాలను జీహెచ్‌ఎంసీ అధికారులు సేకరించారు. మరో నెల రోజుల్లో ఇంటర్నల్ రహదారుల గృహాల సర్వేను పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. భవనాల ఆన్‌లైన్ ప్రక్రియలో ఒక్కో ట్యాక్సు పర్యవేక్షకుడి పరిధిలో నిత్యం 30 గృహాల వివరాలు, ఫొటోలు సేకరించాలని నిర్ణయించుకున్నారు.

ఆదాయం పెంచే దిశగా..

రోజువారీగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు సదరు భవనాలు అసెస్‌మెంట్ అయింది లేనిది, పన్ను విధించిన తీరు తదితర వివరాలు స్పష్టంగా నమోదు చేసేందుకు పన్నుల విభాగం సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు ఇచ్చారు. ప్రధాన రహదారుల్లోని గృహాలను సర్వే చేసి కొత్తగా పన్ను మదింపు చేయడం ద్వారా తాజాగా జీహెచ్‌ఎంసీకి అదనపు ఆదాయం చేకూరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విధానం ద్వారా ఇటీవల 12406 గృహాల సర్వే చేసి, కొత్తగా పన్ను మదింపు చేయడం ద్వారా రూ.1.16 కోట్ల ఆదాయం చేకూరినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రెసిడెన్షియల్ గృహాలు కమర్షియల్‌గా మార్చడం, అదనపు అంతస్తుల నిర్మాణాలు గుర్తించడం ద్వారా పన్ను మదింపు చేసి ఆదాయాన్ని పెంచుకునేందుకు దృష్టి సారిస్తున్నారు.

అవకతవకలకు తెర...

సర్కిల్ పరిధిలోని భవనాలన్నీ ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చి వాటి తీరుతెన్నులను అందులో నిక్షిప్తం చేయడం ద్వారా పన్ను ముదింపు, చెల్లింపు విషయంలో అవకతవకలు జరిగే అవకాశం ఉండే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు.ఇప్పటికీ పలువురు యజమానులు తమ భవనాలకు వ్యాపార పన్నుకు బదులు నివాస భవనపు పన్నులు చెల్లిస్తున్నారు. ఇంకొందరు రెండు నుంచి నాలుగు అంతస్తుల భవనాలు కలిగి ఉన్నప్పటికీ ఒకే ఫ్లోర్‌కు పన్ను చెల్లిస్తున్నారు. ఇక మీదట భవనాల వాస్తవ పరిస్థితి ఆధారంగా మాత్రమే పన్ను చెల్లించాల్సిన పరిస్థితులు అమలులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజుల్లోగా సర్వే పూర్తి చేసి పన్ను మదింపు చేయాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుధాంశ్ ఆదేశాలు జారీ చేశారు.

రైల్వే స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు


ఖాళీగా ఉన్న గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: రైల్వేకు సంబంధించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు హెచ్చరించారు. మంగళవారం మొండిబండ నగర్‌లో ఖాళీగా ఉన్న రెండు గుడిసెలను స్థానిక తుకారాంగేట్ పోలీసులు సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ.. రైల్వే స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మొండిబండ నగర్‌లోని రైల్వే స్థలంలో కొన్ని సంవత్సరాలుగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని నూతనంగా నిర్మాణాలు చేపడితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ఇది వరకు ఇక్కడి గుడిసెల్లో నివాసముండే పలువురికి డబుల్ బెడ్రూమ్‌లు రావడంతో వెళ్లిపోయారని, మరికొంత మంది పాములు, తేళ్లకు బయపడి ఇతర ప్రాంతాల్లో అద్దె ఇళ్లలోకి వెళ్లిపోయారన్నారు. వారికి సంబంధించిన గుడిసెలు ఖాళీగా ఉండడంతో వాటిని మాత్రమే తొలగించినట్లు అధికారులు తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తొలగింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.ఇకపై మొండిబండ నగర్‌లోని గుడిసెవాసులు తమ గుడిసె పరిసరాల్లో ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని, నూతన నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 16, క్యారెట్ 33, దొండ 55, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 50, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వక్ఫ్‌భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని మైనారిటీ హక్కుల ఫోరం జేఏసీ చైర్‌పర్సన్ హజ్రా బేగం విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు మహమ్మద్ షాహిద్‌తో కలిసి ఆమె మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలం, వెల్పూర్ గ్రామంలోని సర్వేనంబరు 1299/1, 1299/2, 1299/3లలోని ఈద్గా శ్మశానవాటికకు చెందిన 4 ఎకరాల 12 గుంటల భూమిని కబ్జాదారులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వెల్పూర్ గ్రామంలోని వక్ఫ్ భూమికి సరిహద్దు గోడ లేకపోవడంతో ఆక్రమణదారులు లాక్కొనేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వక్ఫ్‌బోర్డు అధికారులు సదరు భూమిని సందర్శించి సర్వే చేయించాలన్నారు. ఆ భూమి రక్షణ కోసం కేటాయించిన రూ.8 లక్షలతో భూమిని కాపాడేందుకు వెంటనే సరిహద్దు గోడను నిర్మించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఈ భూముల విషయంలో తగిన చర్యలు తీసుకొని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు.

సీఎం రేవంత్ నిర్ణయం చరిత్రాత్మకం


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని టీపీసీసీ అధికార ప్రతినిధి, పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా మార్చుకుందామంటూ మంగళవారం యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం చనగాని దయాకర్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ వినియోగించకుండా నూతన సంవత్సర వేడుకలపై పోలీసుల నిఘా అవసరమన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు యంత్రాగానికి పూర్తి స్వేచ్ఛ కల్పించడం శుభపరిణామం అన్నారు. వర్సిటీలు, కాలేజీలలో యాంటీ డ్రగ్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని పబ్బులు, క్లబ్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకొని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ అధ్యాపకులు ప్రొ.అల్దాస్ జానయ్య, ఓయూ అధ్యాపకులతో పాటు విద్యార్థి నేతలు మెడ శ్రీనివాస్, సుమన్‌గౌడ్, రహీమ్, అంజిగౌడ్, నెల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన హామీలన్నీ అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. అధికారంలో పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని అన్నింటికీ తాను ఉన్నాననే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు నూతన అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, సంక్రాంతి తర్వాత ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే చేపట్టిన కొన్ని పనులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి,హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, ఆకుల రూప, అరుణగౌడ్, కిరణ్మయి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, నరేందర్‌రావు, సంతోష్, నాగులు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

- అయ్యప్పస్వామి దర్శనం కోసం శబరిమలైకు వెళ్తున్న అయ్యప్ప స్వాముల ద్విచక్ర వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీతాఫల్‌మండికి చెందిన అశోక్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ మూడోసారి గెలిస్తే తాను బైక్‌పై శబరిమలకు వస్తానని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శైలేందర్, కృష్ణ, సాగర్, జగదీష్, ప్రేమ్, కుమార్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద మహంకాళి అమ్మవారి 2024 కేలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ. మనోహర్‌రెడ్డి, చైర్మన్ సూరిటి, సభ్యులు దుబాయ్ శ్రీనివాస్, బచ్చు మహేష్, కిషోర్‌కుమార్, మాణిక్‌యాదవ్, రామ్మోహన్, మహేందర్, అరుణ్‌భట్ పాల్గొన్నారు.

మార్కు చూపించాం..

రాంగోపాల్‌పేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయడంతో తమ ప్రభుత్వ మార్కు చూపించామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం పీజీరోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పీజీ రోడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014కు ముందు పీజీరోడ్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక దశలవారీగా సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ప్రవీణ్, సంజయ్, రోచా, బర్కత్, దీపక్ యాదవ్, ప్రదీప్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అండగా మజ్దూర్ యూనియన్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శంకర్‌రావు

సికింద్రాబాద్: రైల్వే మహిళా ఉద్యోగుల సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపించడంతో పాటు, వారికి ద.మ. రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్ రావు పేర్కొన్నారు. మంగళవారం మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యాలయంలో రైల్వే మహిళా ఉద్యోగుల కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ శతాబ్ది వేడుకల సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ.. రైల్వే మహిళల హక్కుల పరిరక్షణలో తమ యూనియన్ అందించిన సేవలను వివరించారు. రానున్న రోజుల్లో సైతం మహిళల సమస్య పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సరెజినీరెడ్డి, ఉదయభాస్కర్, ఖాజాబాబా, స్వామి, నాగలక్ష్మి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల పదోన్నతులపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ, కేయూ సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల్లో జరిగిన అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలని మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. గతంలో ఎన్నడు లేని విధంగా పదోన్నతుల్లో అక్రమాలు జరగడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నేతలు లెనిన్, నెల్లి సత్య ధ్వజమెత్తారు. ఇదే అంశం పై ఏబీవీపీ నాయకులు పృథ్వీతేజ, కమల్ సురేష్, సుమన్ శంకర్, అలివేలి రాజు, గణేష్ రాష్ట్ర గవర్నర్‌కు బహిరంగ లేఖ రాశారు.

ఎమ్మెల్యే లాస్యనందితకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం ఇస్తున్న సుధాకర్ రావు

రసూల్‌పురా: హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22న సికింద్రాబాద్ జింఖానా మైదానంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి ఎస్. సుధాకర్ రావు తెలిపారు. మంగళవారం ఆయన కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. లాస్యనందితను కలిసి ఆహ్వానించారు. 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, ఫొటోగ్రఫీ, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్ ఇతర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మురుగు పరుగు



లాలాపేట: ఆర్యనగర్‌లోని బ్లూ మూన్ హోటల్ సమీపంలో కొన్ని రోజుల నుంచి మ్యాన్‌హోల్ పొంగి మురుగు పారుతుంది. ఈ ప్రాంతంలో తరచుగా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆర్యనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుపై పారుతున్న మురుగు నీటితో ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాని కోరుతున్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

లాలాపేట: ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8కు చెందిన హంపి (21) బీ–ఫార్మసీ పూర్తి చేసింది. ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కుటుంబాన్ని విడిచి విదేశాలకు వెళ్లడానికి ఇష్టం లేక దిగులుగా ఉంటుండటంతో కుటుంబ సభ్యులు నచ్చచెబుతూ వచ్చారు. ఇంతలోనే సోమవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సబ్ ప్లాన్ నిధులను సంరక్షించాలి

లిబర్టీ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు యాదగిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయకుండా సంక్షేమానికి వినియోగించకుండా వివిధ పథకాలకు ఖర్చుచేసి దళితుల అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్ శుద్ధికోసం హైదరాబాద్ నగర సుందరీకరణ కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీలకు ఖర్చు చేయకుండా ఆయా పథకాలను దారి మళ్లించిందని యాదగిరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆ వర్గాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసేలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దారి మళ్లించకుండా చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులకు 'లియో' మంచి వేదిక



బంజారాహిల్స్: ప్రత్యేక కార్యచరణ, సమావేశాలు, సహకారం కోసం అవకాశాలు మెరుగుపర్చుకోవడం, విజ్ఞానాన్ని పంచుకోవడం, వ్యక్తిగత కనెక్షన్‌లను విస్తరించుకోవడం లీడర్స్ ఫర్ ఇండియా (లియో) ఉద్దేశమని ఈ– ప్లాట్‌ఫామ్ ద్వారా లియో బజ్ అనే ఫ్లాగ్‌షిప్ ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు లియో సీఈఓ మోహన్స్ ఎర్ర వెల్లడించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో లియో మొబైల్ అప్లికేషన్‌ను ఆయన ఆవిష్కరించారు. సౌకర్యవంతమైన నెట్‌వర్కింగ్ కోసం ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కొత్త సభ్యులను కలుసుకోవడానికి, పెట్టుబడులు, సహకారం, ఎదగడానికి ఇదొక మంచివేదిక అన్నారు. లియో హైదరాబాద్‌తో పాటు చెన్నై, ఇండోర్, బెంగళూరు, ముంబై, గుర్గావ్, లండన్‌లో కూడా తన కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించుకుందన్నారు. వచ్చే మూడేళ్లలో వేయి మంది సభ్యులతో శక్తివంతమైన సంఘాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

తెలి దేవర భానుమూర్తికి సత్కారం

పంజగుట్ట: వ్యంగ్య పుస్తకాలు రాయడంలో ఆరితేరిన రచయిత తెలి దేవర భానుమూర్తి అని పలువురు వక్తలు అన్నారు. భానుమూర్తి రచించిన 'లత్కోర్‌సాబ్' గ్రంథ పరిచయ సభ మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత సాహిత్య కళా పరిశోధకులు డాక్టర్ జయధీర్ తిరుమలరావు, ఆత్మీయ అతిథిగా మందలపర్తి కిషోర్, గ్రంథ పరిచయం, సీనియర్ పాత్రికేయులు తెల్లా వజ్జల, వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కె.లక్ష్మణరావు, సభాధ్యక్షత వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షులు వ్యవహరించారు. వారు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ప్రస్తుతం వారు చెప్పే హామీలు, వాగ్దానాలు, నేతల కోతలు వ్యంగ్యంగా ఈ పుస్తకంలో చక్కగా చెప్పారని అభిప్రాయపడ్డారు. ఒక్కో అద్యాయం ఒక చిన్న నాటకం మాదిరి చెయ్యవచ్చని, ఈ పుస్తకం నుంచి ఎంతో ఔట్‌లెట్ వస్తాయన్నారు.